# గ్రామసేవయే రామసేవగా మారుతుంది!

కౌసల్య సతి శుక్తి గర్భమౌటను గదా
రాముడు దేవుడై రమణ గాంచె
సీతా మహాసాధ్వి చెలగి పెంచుట కదా
కవలు కుశలవులు ఘనులు అగుట
జిజియా లలామయు చెలగి పెంచుట కదా
వీర శివాజియు పేరుగాంచె
పుతలిబాయి రంజిల్లి పెంచుట కదా
గాంధి మహాత్ముడై ఘనతగాంచె
ఈశ్వరాంబాసాధ్వి యెత్తి పెంచుట కదా
సత్యనారాయణుండు విశ్వఖ్యాతి గాంచె
ప్రాణికోటి యీ విధి పరిమళించె
అహరహంబున బ్రోచెడి అమ్మకంటె
ఆదరంబగు వ్యక్తులు అవని కలరె!
అమ్మ ప్రథమాక్షరంబె ఆద్యక్షరంబు.

ప్రేమస్వరూపులారా!

సత్యశీలమే మానవుని కఠిన తపము. మానవత్వములో ఉండిన దివ్యత్వమును మానవుడే గుర్తించుకోలేకపోతున్నాడు. జాతికంటే నీతి గొప్పదని, కులముకంటే గుణము గొప్పదని గుర్తించుకొనలేక మానవుడు కేవలము జాతి, కులములపై ఆధారపడి జన్మను నిరర్థకము గావించుకొంటున్నాడు. ప్రాచీన వైదిక ఋషులు మానవ జీవితాన్ని మధురభావముగా భావించారు. ఈ పవిత్రమైన మధురభావమును సంరక్షించుకోటమే

srisathyasaivachanamrutam

మానవుని ప్రధాన కర్తవ్యము. ఇది త్యాగమునందే రూపొందునుగానీ, స్వార్థమునందు మనకు లభ్యము కాదు.

**మానవత్వములో ఉండిన దివ్యత్వము మధురభావమైన మాతృతత్వమే!**

మానవుడు మధురభావమునే కోల్పోయిన, మానవత్వమునే కోల్పోయినవాడౌతాడు. మానవత్వములో ఉండిన దివ్యత్వము మధురభావమైన మాతృతత్వమే! తన బిడ్డలను రక్షించుకొనే నిమిత్తము మాతృదేవి తనను తాను అర్పితము గావించుకొని, తన సర్వస్వమును త్యాగము చేసి పుత్రరక్షణకై పాటు పడుతుంది. భారతదేశములో తల్లులు చేసిన త్యాగమువల్లనే మాతృత్వమునకు యింత విలువ అధికమైపోయింది. 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః' అని మానవత్వములో వుండిన త్యాగముకంటే అమృతత్వము, అమరత్వము మరొకటి లేదు. మాతృతత్వమునందున్న మధురభావము, దివ్యభావము, నవ్యభావము, పవిత్రభావము మరి యే మార్గమునందు మనకు కానరావు. ఆ మాతృదేవి తన రక్తమును, తన సర్వస్వమును ధారపోసి బిడ్డలను రక్షించుకొనే నిమిత్తమై తనయొక్క సర్వము అర్పితము గావించుకుంటుంది. ఈనాడు మాతృప్రేమను యేమాత్రము పోషించుకొనుటకు ప్రయత్నించటం లేదు. శ్రీరాముడు 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని ప్రకటించాడు. భగవంతుడు నిర్గుణుడు, నిరాకారుడు. అవ్యక్తమైన భగవంతుని అనేక విధములుగా ఆరాధనలు సల్పుతున్నారు. భగవంతుడు సర్వులకు అనుకూలమైన స్థితిలో లేడు. అట్టి దైవత్వాన్ని మనము విశ్వసించి, ఆరాధించి, అనేక విధముల ఆనందమును అందుకుంటున్నాం.

**పంచభూతములు, పంచకోశములు, పంచేంద్రియములు మొ॥నవి మానవులందరికి సమానమే అయినప్పటికి సంకల్ప, వికల్పములందు భేదముంటున్నది**

భారతీయ సంస్కృతియందు ప్రధానమైన సూత్రములు 'మాతృదేవోభవ,' 'పితృదేవోభవ,' 'అచార్యదేవోభవ,' 'అతిథిదేవోభవ.' మానవునికి అందుబాటులో ఉన్న, ప్రత్యక్షముగా గోచరమవుతున్న అనుభూతి కలిగించుచున్న మాతృమూర్తియే ప్రధాన దేవత. మాతృమూర్తియొక్క అభీష్టము, మాతృమూర్తియొక్క ఆనందము, మాతృమూర్తియొక్క

sri sathyasai vachanamrutam

చర్యలు పుత్రులకు స్పష్టమే! ఏ విధముగా ప్రవర్తించిన తన తల్లి ఆనందించునో, యేవిధమైన జీవితాన్ని గడపిన తన తల్లి ఆనందించునో, అది పుత్రునకు తెలుసు. అవ్యక్తమైన దైవత్వము దేనిని ఆశించునో, దేనిని విసర్జించునో దేనిని ఆగ్రహించునో, దేనిని అనుగ్రహించునో ఎవరికి తెలియదు. అట్టి అవ్యక్తమైన దైవాన్ని ఆరాధిస్తూ తనయొక్క ఆగ్రహమునకు, అనుగ్రహమునకు గురికావటంకంటే మాతృమూర్తులను ఆరాధించి, మాతృమూర్తులను గౌరవించి వారి అనుగ్రహమునకు పాత్రులు కావటము పవిత్రమైన కర్తవ్యముగా ఉంటున్నది. ఆ విధముగా ఉండిన 'దైవత్వమునకు ప్రత్యేకత ఎందుకు యివ్వాలి?' అని కొంచెం సందేహము కలుగవచ్చు. విద్యుత్ దీపములు ఉంటుంటాయి. ఈ బల్బులు అన్నీ సమానముగానే మనకు గోచరిస్తాయి. కానీ, వాటిలో అనేక విధములైన భేదములు మనకు ఉంటున్నాయి. అందులో ఉన్న ఫిలమెంట్ వ్యత్యాసముగా ఉంటుంది. యీ ఫిలమెంట్ 40గా ఉండవచ్చు, 60గా ఉండవచ్చు, 100గా ఉండవచ్చు, 500గా ఉండవచ్చు, 1000గా ఉండవచ్చును. అదే విధముగా మానవశరీరమందు పంచభూతములు, పంచకోశములు, పంచేంద్రియములు, మలమూత్రదుర్గంధమాంసరక్తములు అందరికి సమానముగానే ఉండవచ్చు. కానీ సంకల్ప, వికల్పములందు భేదము ఉంటున్నది. పవిత్రమైన దివ్యశక్తియందు భేదము ఉంటున్నది. ఆ దివ్యశక్తి దైవత్వమునందు అధికముగా ఉండటంచేతనే దైవత్వానికి యింత ప్రత్యేకతనందించవలసి వచ్చింది.

**అణువునందున్నదే ఘనమునందుకూడను ఉంటున్నది**

'యత్పిండే తత్ బ్రహ్మాండే' అన్నారు. పిండములో ఉన్నటువంటిదే బ్రహ్మాండమునందుకూడా ఉంటున్నది. బ్రహ్మాండమును విరాటస్వరూపమని, పిండాండమును అణుతత్వమని, మనము భావిస్తున్నాము. యిది చాలా పొరపాటు. అణువునందు ఉన్నదే ఘనమునందుకూడను ఉంటున్నది. అణు, ఘనములకు ఎట్టి భేదము లేదు. చిన్న విత్తనములో ఘనమైన పెద్ద వృక్షము ఉంటున్నది. ఈ విశాలమైన పెద్ద వృక్షమంతా చిన్న విత్తనములోనే యిమిడి ఉంటున్నది. విరాటస్వరూపమనగా అనేక



srisathyasaivachanamrutam

వస్తువులయొక్క చేరిక కాదు. అనేకత్వముయొక్క యేకత్వముకూడను కాదు. విరాటత్వమనగా సర్వస్వము కూడినదే విరాటత్వము. దీనికి వృక్షమునకు, విత్తనమునకు ఉండిన భేదమే. విత్తనమునందు మహావృక్షము మనకు గోచరించదు. అదే అణుమాత్రమైన తత్త్వము. ఆ అణువునందే ఘనము యేర్పడిఉంటున్నది. విత్తనములేక వృక్షము, వృక్షములేక విత్తనము ఉండుటకు వీలుకాదు. ఇవి రెండూ అవినాభావ సంబంధము, అన్యోన్య ఆశ్రయము. మానవునకు, దేవునకు వ్యత్యాసము యేమాత్రము లేదు. దైవత్వమునందు ఉన్న దివ్యత్వమే మానవత్వమునందుకూడా ఉంటున్నది. కానీ మనకు అది గోచరించటానికి వీలుకాని స్థితిలో ఉంటున్నది. అగ్గి పుల్లలో నిండుగా అగ్ని ఉంటున్నది. కానీ అది నీటిలో తడవటంచేత ఎన్ని విధముల గీచినప్పటికి అగ్ని ఆవిర్భవించదు. అదే విధముగనే ప్రతి మానవునియందు జ్ఞానాగ్ని, దివ్యాగ్ని, తేజాగ్ని నిండి ఉంటున్నది. కానీ ఎన్ని సాధనలు చేసినప్పటికిని, ఎంత తపస్సు ఆచరించినప్పటికిని, ఎన్ని సత్కర్మలు సల్పినప్పటికిని, అది యేమాత్రము మనకు గోచరము కావటము లేదు. సాక్షాత్కరించటం లేదు. కారణము యేమిటి? ఆ మనోతత్త్వము అహంకారమమకారములనే నీటిచే తడుపబడటంచేత యీ దివ్యాగ్ని మనకు గోచరము కావటంలేదు. అభిమానమమకారములనే నీటిలో తడిసిన యీ మనస్సును వైరాగ్యమనే సూర్యరశ్మిలో పెట్టినప్పుడే యిది ప్రకాశవంతమైన జీవితాన్ని అందిస్తుంది. మానవునికి అన్నీ తెలుసు. ఏఏ దేశములందు యేయే కర్మలందు ఏఏ విధమైన పరివర్తన జరుగుతున్నది తెలుసును. కానీ తన తత్త్వాన్ని తాను తెలుసుకోలేకపోతున్నాడు. ఎన్ని తెలిసి ఏమి ఫలము?

**ఎన్ని విద్యలు నేర్చియు నేమి ఫలము?**
**తన్నొసటి వ్రాత తప్పింప ఎవరి తరము?**
**చెడ్డ బుద్ధులు తన తల చేరెనేని**
**బండబారును బుద్ధులు ఎండబారు**

మన తెలివితేటలు యిందుకు యేమాత్రము పనికిరావు. మన బుద్ధికుశలత యేమాత్రము పనికిరాదు. మన ధనకనకవస్తువాహనాదులు, అహంకారము ఎందుకూ పనికిరాదు.

srisathyasaivacharamrutam

దివ్యమైన భావము, నవ్యమైన నడత కావాలి. దేశముయొక్క సౌభాగ్యమంతా ఆకాశమునుండి వుట్టి పడలేదు. భూమినుండి పుట్టిరాలేదు. మానవుని నడతలనుండియే దేశసౌభాగ్యము అభివృద్ధి నొందుతున్నది. కనుక, యీనాడు మానవుని నడతలు పవిత్రమైనవిగా తీర్చిదిద్దుకోవాలి.

**నైతిక, ధార్మిక, త్యాగ జీవితము మానవునికి ప్రధానమైనది**

ప్రేమస్వరూపులారా! మానవత్వము ఎంత విలువ కలిగినదో మనము చక్కగా విచారించాలి. మాతృతత్వమును యీనాడు మనం మరచిపోతున్నాము. పుత్రునియొక్క కర్తవ్యమును విస్మరిస్తున్నాము. దివ్యమైన ఆనందమును అభిలషిస్తున్నాము. యిది యేరీతిగా మనకు లభ్యమవుతుంది? కర్తవ్యమును నిర్వర్తించక, మానవత్వమును విస్మరించి, దివ్యత్వముతో విరోధము గావించుకొని కేవలము లౌకిక, భౌతిక జీవితమును ఆశించి సుఖశాంతులు కావాలంటే యే రీతిగా మనకు లభ్యమవుతాయి? రాముడు అయోధ్యను వదలి విశ్వామిత్రునితో అరణ్యమునకు వెళ్లి యజ్ఞసంరక్షణ సల్పిన తరువాత విశ్వామిత్రుని ఆజ్ఞను పురస్కరించుకొని మిథిలాపురము చేరాడు. అక్కడ శివధనస్సును ఛేదించాడు. జనక మహారాజు తన కుమార్తెయైన సీతను రామునికిచ్చి కళ్యాణము చేయాలని ఆశించాడు. కానీ రాముడు అంగీకరించలేదు. 'నా తల్లితండ్రులయొక్క అంగీకారము లేక, నా తల్లితండ్రులయొక్క ఆజ్ఞను నేను పొందక, యీ వివాహమునకు నేను యేమాత్రము ఒప్పుకోన'న్నాడు. విశ్వామిత్రుడు ఎన్ని విధములో రామునకు నచ్చచెప్పాడు. కడకు గురువాజ్ఞనుకూడా మీరి తల్లితండ్రులయొక్క అనుమతి అత్యంత అవసరమన్నాడు. ఆ తల్లితండ్రులు వచ్చేంతవరకు, తల్లితండ్రులు తమ అభీష్టము తెలిపేంతవరకు సీతను కన్నెత్తికూడా చూడలేదు. ఇట్టి మాతృభక్తి, పితృభక్తి కలిగిన శ్రీరామచంద్రునియొక్క తత్వమును యీనాడు భారతదేశమందు విస్మరించి ఉంటున్నాం. పితృవాక్యపరిపాలన నిమిత్తమై తాను కఠినమైన అరణ్యవాసము చేసి 14 సం॥లు కఠిన జీవితమును గడిపాడు. సత్యనిష్ఠనే నిజమైన తపస్సుగా భావించాడు. ఈ అరణ్యమునకు భరతునితోపాటు వశిష్ఠుడుకూడను వెళ్లి రామచంద్రునికి ఎన్నో విధముల నచ్చచెప్పుటకు ప్రయత్నించాడు.

sri sathyasaivachanamrutam

అందుకు రాముడు "గురుజీ! నైతికభావముకంటె మానవజీవితము అధికమైనది కాదు. తండ్రియొక్క ఆజ్ఞను శిరసావహించి నేను యీ అడవిలో ప్రవేశించాను. ఈనాడు నేను తండ్రి ఆజ్ఞను ఉల్లంఘించి రాజ్యములో ప్రవేశించిన నా తండ్రిపట్ల, నైతిక మర్యాదను కోల్పోయినవాడనౌతాను. నేను ప్రాణమునైనా వీడుదును గానీ నైతికవిలువను యేమాత్రము వీడను" అని ఖండితంగా చెప్పాడు. నైతికజీవితము, ధర్మజీవితము, త్యాగజీవితము, మానవునికి ప్రధానమైన సూత్రములని రామచరిత్ర లోకమునకు ప్రబోధిస్తూ వచ్చింది.

**మాతృదృష్టికి నోచుకోలేని పుత్రులు దైవదృష్టికికూడా నోచుకోలేరు**

తల్లిప్రేమకు, తల్లిదృష్టికి నోచుకోలేనివాడు మహాదురదృష్టవంతుడనే చెప్పుకోవచ్చు. ఈ సందర్భములో భారతయుద్ధములో జరిగిన మరొక ఘట్టమును మనము విచారించాలి. కౌరవులందరు హతమారిన తరువాత గుడ్డివాడైన ధృతరాష్ట్రుడు, గాంధారి దుఃఖించుచుండగా వారిని ఓదార్చే నిమిత్తమై కృష్ణుడు వెళ్లాడు. గాంధారి పట్టలేని కోపముతో ఊగిపోతూ కృష్ణుని అనేక విధములుగా నిందిస్తూవచ్చింది. అప్పుడు కృష్ణుడు "గాంధారీ! నీవు చాలా పొరపడుతున్నావు. పుట్టినప్పటినుండి నీవు ఒక్కసారైనా నీ కుమారులను కన్నెత్తి చూచావా? తల్లిదృష్టికే నోచుకోలేని కౌరవులు నా దృష్టిలో యేవిధముగా పడగలరు?" అని చెప్పాడు. కనుక, మాతృదృష్టికి గురికానటువంటి పుత్రులు దైవదృష్టికికూడా గురికాలేరు. యిట్టి పవిత్రమైన ధర్మసూత్రములు యీనాడు భారతదేశమందు నశించిపోయినాయి. కేవలము స్వార్థము, స్వప్రయోజనములకై జీవితమును అంకితము గావించుకొని దైవత్వమును, దివ్యత్వమును, పవిత్రమును మనము విస్మరిస్తూ వచ్చాము. మానవులు నీతినిజాయితీలను కోల్పోతున్నారు. యీనాడు భారతదేశమునందు జరుగుతున్న చరిత్రను బట్టి చూస్తే భారతదేశము ఎంతగానో దిగజారిపోయింది, నీతియందు.

**దేశసౌభాగ్యము నిమిత్తమై మానవులు ఐక్యతగా జీవించాలి**

ప్రేమస్వరూపులారా! మానవజాతికి నీతియే ప్రధానమనే సత్యాన్ని గుర్తించాలి. మన కర్తవ్యకర్మలను నిర్వర్తించాలి. ఐకమత్యముతో మనం సమాజసేవలో పాల్గొనాలి. ఐకమత్యమే

మహాబలము. అందరి శ్రేయస్సు ఐకమత్యములోనే ఇమిడియున్నది. ఈ ఐకమత్యము, శ్రేయస్సు కోరనివాడు సమాజమును యేవిధముగా అభివృద్ధి గావించగలడు? 'చిన్న చీమలు చేరి సర్పంబును చంపుచుండుట లేదె జగతియందు!' ఈనాడు మనము ఐకమత్యమును కోల్పోతున్నాము. ఒక్కొక్క గృహమునందే అభిప్రాయ భేదములు అధికమవుతున్నాయి. చీలిపోయిన సంస్థ కూలిపోతుంది. చీలిపోయిన దేశముకూడను కూలిపోతుంది. కనుక, దేశసౌభాగ్యము నిమిత్తమై మానవులు ఐక్యతగా జీవించాలి. నీచము, అధికమనే తారతమ్యములు అధిగమించాలి. దేశక్షేమాన్ని హృదయమందు హత్తుకునేటట్లుగా చేసుకోవాలి. ఈనాడు మీకందరికి తెలిసిన విషయమే! ఒక్కొక్క పార్టీలో చీలికలు ప్రారంభమవుతున్నాయి. ఈ చీలికలు ప్రారంభముకావటంచేతనే ఆ పార్టీలు శిధిలమైపోతున్నాయి. ఈ విధముగా పార్టీలు శిధిలమైన తరువాత దేశము యేరీతిగా సౌభాగ్యమునందుకోగలదు? దేశసౌభాగ్యమును ఆశించే వ్యక్తి స్వార్థమును దూరముగా నెట్టి ఐకమత్యము పెంపొందించి దేశముయొక్క సౌభాగ్యమును చేబట్టాలి. యిదే భారతదేశముయొక్క ప్రధాన సూత్రము. పవిత్రమైన భారతదేశమునందు భారతీయుడనని పేరు పెట్టుకొని 'నేను భారతీయుడను, నా దేశము భారతదేశము, నా ధర్మము భారతధర్మము' అంటూ సగర్వంగా చెప్పుకోలేని స్థితిలో భారతీయులు దేశముయొక్క గౌరవమును విస్మరిస్తున్నారు.

**ఇది నాదు మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం**
**చెదగొట్టి నుడువనేరక**
**బ్రదికిన జీవి యొకడైన వసుధను గలడా!**

భారతీయుడనని నీవు చెప్పుకున్నందుకు, భారతీయ సంస్కృతిని నీవు అభివృద్ధి గావించాలి. భారతీయ సంస్కృతిని నీవు అనుసరించాలి. ఐకమత్యమునే కోల్పోయిన తరువాత, యింక మనము చేసే పని యేమిటి? శాంతి, శాంతి, శాంతి అంటారు. శాంతి ఎట్లా వస్తుంది?

**మనస్సు, వాక్కు, క్రియ యీ మూడింటి ఏకత్వమే శాంతికి మార్గము**



srisathyasaivachanamrutam

**హస్తమున అణుబాంబు ఉంచుక**
**అరచుచుందురు శాంతి శాంతియని**
**చంద్రుచేరగలిగికూడను**
**చెందజాలరు శాంతిసుఖములు**

హస్తములో అణుబాంబు పెట్టుకొని ఎక్కడనుండి వస్తుంది శాంతి? ఈ అణుబాంబును విసర్జించినప్పుడే శాంతి మనకు లభిస్తుంది. ఈనాడు దేశములోపల ఎన్నో కలతలు, కల్లోలములు చెలరేగుతున్నాయి. యిది యేమాత్రము దేశమునకు మంచిది కాదు. ఒక యింటిలో ముగ్గురు వ్యక్తులున్నారనుకోండి! ఈ ముగ్గురు వ్యక్తులు కలసి అన్యోన్యముగా వుండినప్పుడే యింటిలో మనము శాంతిని ఆనందమును అనుభవించుటకు వీలవుతుంది. ఒకరిపై ఒకరు విరోధము పెంచుకుని, అన్యోన్యతను చెడగొట్టుకొన్నప్పుడు ఆ యింటిలో శాంతి యేవిధముగా అభివృద్ధి గాంచుతుంది? యీనాడు శాంతి ఏ రీతిగా మనకు లభ్యమవుతుంది? దేహమనే గృహమునందు మనస్సు, వాక్కు, క్రియ అనే ముగ్గురు వ్యక్తులు ఉంటున్నారు. ఈ ముగ్గురు వ్యక్తులు ఐకమత్యంగా ఉండినప్పుడే మనకు శాంతి లభ్యమవుతుంది. మనసులోని మాటను వాక్కు వినటం లేదు. వాక్కుయొక్క మాటకు అనుగుణంగా క్రియ చేయటం లేదు. యింక శాంతి ఎట్లా మనకు లభ్యమవుతుంది? యీ మూడింటి యేకత్వమే నిజమైన శాంతికి మార్గము.

**వ్యక్తిగా మనము రూపొందవలెనన్న మనయందున్న దివ్యశక్తిని సాధనద్వారా వ్యక్తము గావించుకోవాలి**

దివ్యాత్మస్వరూపులారా! మానవత్వములోనే మొట్టమొదట దివ్యత్వమును అభివృద్ధి గావించుకోవాలి. మానవత్వములోని దివ్యత్వమును వ్యక్తము చేసుకోవాలి. అప్పుడే మనము నిజమైన వ్యక్తులుగా రూపొందుతాము. వ్యక్తి, వ్యక్తి, వ్యక్తి. అనగా ఏమిటి? కేవలము తల, కాళ్లు, చేతులతో కూడినవాడా వ్యక్తి? కాదు. యీ వ్యక్తి అనే పదమునకు అనంతమైన, ఘనమైన అర్థము ఉంటున్నది. అవ్యక్తముగా, గూఢముగా ఉన్న దివ్యశక్తిని ఎవరు వ్యక్తీకరింపచేయుదురో అతనే వ్యక్తి. మిగిలిన వారందరు వ్యక్తులు కారు. అవ్యక్తులు.

srisathyasaivachanamrutam

కనుక, వ్యక్తిగా మనము రూపొందవలెనన్న మనయందున్న దివ్యమైన శక్తిని సాధనద్వారా వ్యక్తము గావించుకోవాలి. భేదభావములు దూరము గావించుకోవాలి. అందరియొక్క ఐక్యతను మనము ఆశించాలి. మనలో మనకు కొన్ని భేదములుండవచ్చు. అంత మాత్రమున మనము దుఃఖించరాదు. ఈ భేదములను దూరముగావించవలెనన్న ప్రేమతత్త్వమును పెంచాలి. అదే నిజమైన మార్గము. మానవుని జీవితము చాలా విలువైనది, జీవించతగినది, పవిత్రమైనది, దివ్యమైనది, ఉత్కృష్టమైనది, ఉజ్వలమైనది, సౌశీల్యమైనది. మానవుని ఆయుఃప్రమాణము అల్పము. యిది మనము గుర్తించుకొని ఆయువు ఉండినంత లోపలనే మనయందుండిన శక్తిని మనము వ్యర్థము గావించుకొనక, సార్థకము గావించుకొనుటకు ప్రయత్నించాలి. ఐతే యీ దివ్యశక్తిని మనము యేవిధంగా వ్యర్థము గావించుకుంటున్నాము? దుష్కర్మలచేతను, దురభిప్రాయములచేతను, దుచ్ఛింతనలచేతను, దుశ్చర్యలచేతను మనయొక్క దివ్యమైన శక్తిని మనం వ్యర్థము చేసుకుంటున్నాము. పరతత్త్వాన్ని విచారించుకోలేకపోతున్నాం.

**చేతులనిచ్చిన దెందుకో తెలుసా!**
**మూతికి ముద్దందించుటకా? కాదు, కాదు**
**పతితపావనుడౌ శివుని పూజలు**
**చేతులార చేసేటందుకురా!**

తినటానికి కాదు చెయ్యినిచ్చినటువంటిది, పనులు చేయటానికి యిచ్చినది. రెండు చేతులనిచ్చినాడు భగవంతుడు, ఒక్క కడుపు యిచ్చాడు. రెండు చేతులతో మనం చక్కగా పని చేస్తే కడుపు ఎందుకు నిండదు?

### భగవంతుడు ఏమైనా చేయగలడు

యీనాడు మనం రెండు చేతులనిందుకు పని చేయటం లేదు. కడుపుకు తిండిలేదనిమాత్రం కంగారు పడుతున్నాము. యిది మన దోషమే, మన సోమరత్వమే! భారతదేశమునందు సోమరత్వానికి యేమాత్రము అవకాశము యివ్వకూడదు. సోమరుడైన మానవునికి తినటానికికూడను అధికారము లేదు. పని చేయాలి. అది మన కర్తవ్యం!

sri sathyasai vahanamrutam

కర్మాధికారము మాత్రమే ఉంటున్నది, మనకు. 'కర్మానుబందీని మనుష్యలోకే'. కనుక, మనము కర్మలనాచరించాలి. ఎట్టి కర్మలాచరించాలి? ఎప్పుడు, ఎక్కడ, ఎట్లా, ఏవిధంగా చేయాలనే విచారణ చేసి తదుపరి కర్మలో ప్రవేశించాలి. దైవత్వమును యీనాడు ఎవరూ సరిగా అర్థము చేసుకోటం లేదు. మిమ్మల్ని మీరు గొప్ప తెలివితేటలుగలవానిగా విశ్వసిస్తున్నారేగానీ, ఆ తెలివితేటలు ఎంత వ్యర్థమైనవో మీరే గుర్తించుకోవచ్చు. భగవంతుడు ఏమైనా చేయగలడు. దీనికి ఎట్టి సందేహము లేదు. దీపమునకు ప్రకాశము యిచ్చినది భగవంతుడే! దానిని ఆర్పుటకు గాలికి శక్తి యిచ్చినదికూడ భగవంతుడే! గాలికి ఆర్పే శక్తి ఉంది. దీపమునకు వెలిగే శక్తి ఉంది. కానీ, గాలిలో దీపము పెట్టి 'ఓ దేవుడా! దీనిని ఆరిపోకుండా చూచుకో'మంటే ఎంత అవివేకము! ఇది నిజముగా తెలివిగలవాడు చేసే పనికాదు. దైవశక్తిని ఎప్పుడు యేవిధముగా కాపాడుకోవాలో ఆ విధంగా కాపాడుకోవాలి. ఒకానొక వ్యక్తి ఒకప్పుడు నన్ను ప్రశ్నించాడు: 'స్వామీ! మీరు ఒకసారి జలమును పెట్రోలుగా మార్చారుట! యీనాడు భారతదేశములో పెట్రోలు ధర పెరిగిపోయింది. ఈ పెట్రోలుకై అనేక కోట్లు వ్యయము చేస్తున్నాది, ప్రభుత్వము. మన భారతదేశములోపల బొంబాయి, మద్రాసు యిత్యాది ప్రాంతములందు (కావలసినంత) పెద్ద సముద్రము ఉంటున్నాది. ఈ సముద్రాన్ని అంతా మీరు పెట్రోలుగా ఎందుకు మార్చకూడదు?' అప్పుడు నేను చెప్పాను, 'చాలా మంచిదే నాయనా! నీవు చాలా తెలివితేటలు కలవాడవే! కానీ నీ తెలివితేటలు సరిగా పని చేయటం లేదు.' 'ఏమిటి! జగత్తుకు ఉపకారం చేసే ప్రశ్న కదా యిది; నా తెలివితేటలకు యేమి దోషము ఏర్పడింది?' అని ఆ వ్యక్తి ఆశ్చర్యపోయాడు. 'మంచిదే! మద్రాసు, బొంబాయి తీర ప్రాంతములోని సముద్రమునంతా పెట్రోలుగా మార్చవచ్చు. కానీ నీబోటి తెలివితక్కువవాడు సముద్రము ఒడ్డున సరదాగా నడిచి వెడుతూ సిగరెట్టు అంటించుకొని ఆ అగ్గిపుల్లను దాంట్లో వేస్తే యీ సముద్రము, యీ దేశము ఏమైపోతుంది? ప్రపంచము గతేమవుతుంది? ఈ శ్రేయస్సును నీవు ఏమాత్రమైనా యోచించావా? దేశక్షేమమును నీవు యేమాత్రమైనా గుర్తుపెట్టుకొన్నావా? అల్పమైన భావముతో సముద్రాన్ని పెట్రోలుగా మార్చండి అంటున్నావు. యిది తెలివి తక్కువ ప్రశ్న' అన్నాను. యిలాంటి తెలివితేటలు ఉండినవారు ఈనాడు ప్రపంచములో దండిగా ఉన్నారు. వీరు తమ తెలివితేటలకు తాము మురిసిపోతూ తమను గొప్పవారుగా విశ్వసిస్తున్నారు.

sri sathyasai vahamrutam

యిలాంటివారే భగవంతుని విమర్శించటానికి ముందుకు వచ్చేవారు.

**మానవుడు తాను చేయవలసిన పనులు చేసే తీరాలి**

భగవంతుని విమర్శించే అధికారము ఎవరికి లేదు. భగవంతుడు తన సంకల్పముచేత యేమైనా చేయగలడు. స్వార్థము లేక చేసిన పనులన్నీ పరార్థములే! భగవంతుడు సర్వులందు ఉంటున్నాడు.

**విశ్వమంతా విష్ణు వివిధరూపములే**
**సర్వభూతములందు సర్వవేళల**
**ప్రభుని దివ్యశక్తే పాలించుచున్నది**
**జీవకోటులన్ని దైవమయమే!**

ప్రతి మానవుడు దైవస్వరూపుడే! నీవు మొట్టమొదట 'నేను దైవస్వరూపుడ'నని విశ్వాసము అభివృద్ధిపరచుకున్నప్పుడు యీ తుచ్ఛమైన మార్గములో ప్రవేశించటానికి యేమాత్రము అవకాశము ఉండదు. అందరియందు ఉండిన దైవత్వము ఒక్కటే! 'ఏకాత్మసర్వభూతాంతరాత్మ'. ఐతే అంతటి ఉన్నత స్థితి అందరికి లభ్యముకాదు. కానీ ప్రయత్నించాలి. ప్రయత్నము లేక దేనిని పొందలేము. సింహము మృగరాజు. 'నేను మృగరాజుకదా!' అని పోయి గుహలో కూర్చుంటే ఏ మృగాలు వచ్చి ఆహారంగా అర్పితమవుతాయి? మృగరాజు అయినప్పటికి తన కర్తవ్యము తాను నిర్వర్తించాలి. మృగములపైన బడి వేటాడాలి. అప్పుడే తన కడుపు నిండుతుంది. అట్లు లేకుండా మానవుడు తన కర్తవ్యమును విస్మరించి దైవమే సర్వము చేయాలని కూర్చుంటే అది కేవలము సోమరత్వమేగానీ నిజమైన భక్తిప్రపత్తులు కాదు. మానవుడు చేయవలసిన పనులు చేసే తీరాలి. అందుకోసమే మానవత్వము ఆవిర్భవించింది.

**'నేను' అనేదే ఆత్మకు మొదటి పేరు**

దివ్యాత్మస్వరూపులారా! మానవుడైన ప్రతివాడుకూడను తనయొక్క సత్యాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించాలి. నేను ఎవరు? దేహమా? మనస్సా? బుద్ధా? చిత్తమా?

srisathyasaivachanamrutam

అంతఃకరణా? ఆత్మనా? దేనికీ జవాబు రావటం లేదు. 'నేను మానవుడను' అనుకున్నప్పుడు ఆకార మానవుడా? ఆచార మానవుడా? యిది కూడను తనకు అర్థము కావటం లేదు. ఈనాడు ఆధ్యాత్మికతత్త్వమును గూర్చి ప్రబోధలు చేసేవారు దినదినమునకు అభివృద్ధి అవుతున్నారు. కానీ, ఆచరణమాత్రము శూన్యముగా కనుపిస్తున్నాది. ఆచరణ ప్రధానముగానీ ఆచార, ప్రచారములు ప్రధానము కాదు. సాయి తత్త్వమును చాలామంది అర్థము చేసుకోలేనివారు ఉంటారు. సాయి తత్త్వము అనుకుంటే యెందుకు యీవిధముగా జరుగుతున్నది? ఈ సాయి ఎవరు? దీనిని ఎవరూ అర్థము చేసుకోలేరు. నేను సన్యాసిని కాదు. నేను యోగిని కాదు. నేను భోగిని కాదు. నేను త్యాగిని కాదు. 'నేను నేనే!' యీ 'నేను' అనే పదమే ఆత్మకు మొదటి పేరు. సన్యాసి అయితే కొన్ని కొన్ని హద్దులు ఉంటాయి. యోగినైతే కొన్ని కొన్ని పరిమితులు ఉంటాయి. కానీ నాకు యే పరిమితము లేదు. అపరిమితమైన ఆనందమే నాది. నా పేరు 'నేను.' 'సత్యసాయి' అనేది పెట్టిన పేరుగానీ, పుట్టిన పేరు కాదు. దివ్యత్వమును గుర్తించవలెనంటే ప్రతి ఒక్కరియందు 'నేను,' 'నేను' అనే పదము నిండి ఉంటున్నది. 'స్వామీ! నేను యీ పని చేశాను,' 'నేను యిప్పుడు వెడుతున్నాను,' యీ విధంగా ప్రతి వ్యక్తి కూటిపేద మొదలు కోటీశ్వరునివరకు 'నేను,' 'నేను' అనే పదమును ఉపయోగపెడుతున్నాడు. 'ఎవరు రామయ్య?' అని ప్రశ్నిస్తే 'నేను' అని ఒకరు చేయి ఎత్తుతాడు. 'ఎవరు కృష్ణయ్య?' అని అడిగితే 'నేను' అని చేయి ఎత్తుతాడు, ఒకడు. 'ఎవరు గోవిందుడు?' అంటే 'నేను' అని చేయి ఎత్తుతాడు, మరొకడు. కాబట్టి రామునియందు, కృష్ణునియందు, గోవిందునియందు 'నేను' అనే పదము సమంగా ఉంటున్నది. కాబట్టి, 'నేను' అనేదే సర్వత్రనిండినది. అదే 'అహం బ్రహ్మాస్మి'. ఆ 'నేను' అనేదే బ్రహ్మతత్త్వము. యీనాడు 'నేను' అనే పదమును తెల్లవారి మొదలు రాత్రివరకు ఉపయోగపెడుతున్నాముగానీ ఆ 'నేను' ఎవరో మనకు అర్థము కావటం లేదు. తెలియటం లేదు. మొట్టమొదట 'నేను' కనుక్కోవాలి. ఈ 'నేను' ఒక వ్యక్తికి మాత్రమే సంబంధించినది కాదు; సమిష్టి స్వరూపమే 'నేను.' వ్యష్టిస్వరూపమే జగత్తు. ఈ జగత్తుకూడను 'నేను' లోనే లీనమై ఉంటున్నది.

sri sathyasai vahini amrutam

## పవిత్రమైన మానవుని హృదయము పరమాత్మునికి పీఠముగా ఉంటున్నది

ప్రేమస్వరూపులారా! మానవత్వము యీనాడు దివ్యత్వమును పొందవలసిన స్థితిని కోల్పోతున్నాది. భౌతికమైన, లౌకికమైన సుఖసంతోషములకై ప్రాకులాడుతున్నారు. ఒక్కొక్క దేశము ఇతర దేశములపైన బడి దానిని భస్మము గావించాలని ప్రయత్నిస్తున్నాది. యివి చాలా దుష్టబుద్ధులు. అన్ని దేశములు సుక్షేమంగా ఉంటుండాలి. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు.' అందరు సుఖంగా ఉంటుండాలి. అందరి సుఖమును కోరినప్పుడే అందులో నీ సుఖము చేరుతుంది. అందరి సుఖమును కోరక తన సుఖమే తనకు కావాలంటే తనకు యేమాత్రము సుఖము లభ్యము కాదు. మానవులైనవారు యీ ద్వేష, అసూయ, ఆడంబరములకు అవకాశమునందించరాదు. ఈ అహంకారమనేదే మానవుని అధఃపతనము చేస్తున్నది. అహంకారమునకు యేమాత్రము అవకాశము యివ్వరాదు. ఈ అహంకారము కేవలము అజ్ఞానముయొక్క ప్రథమ లక్షణము. దానికి బ్రదరే అసూయ. ఈ రెండూ చేరెనా ఒకటి చీడపురుగు, మరొకటి వేరుపురుగు. ఈ చీడపురుగు, వేరుపురుగు చేరుతే చెట్టు శిధిలమై పోతుంది. ఈ రెండింటికి మనము అవకాశము యివ్వరాదు. పవిత్రమైన మానవుని హృదయము పరమాత్మునికి పీఠముగా ఉంటున్నది. అటువంటి పరమాత్ముని పీఠమైన హృదయములోపల యీ దుర్గుణములు మనము ప్రవేశపెడితే ఎవరికి నష్టము? నీకే నష్టము! కనుక దుర్గుణములను మనము హృదయమందు ప్రవేశపెట్టరాదు. దుర్భావములను యేమాత్రము భావించరాదు. సత్యనిత్యమైన దివ్యత్వమును విశ్వసించి ప్రేమతత్త్వాన్ని అభివృద్ధిగావించుకొని అందరియొక్క ఐక్యతను మనం ఆశించాలి. ఈ కులమతభేదములను కూలద్రోయండి. అందరిది ఒకే కులము; అదే మానవకులము. అందరిది ఒకే భాష. అదే హృదయ భాష; అందరిది ఒకే మతము; అదే దివ్యమైన మతము. ఈ మూడింటిని మనము ఆధారము చేసుకోవాలి.

## అనేకత్వములో ఉండిన ఏకత్వాన్ని గుర్తింపజేసే సాధనలో మనము ప్రవేశించాలి

విద్యార్థులారా! మీరు దేశమునకు నాయకులు కావలసినటువంటివారు. భవిష్యత్తులో

sri sathyasai vahini amrutam

భారతదేశముయొక్క మంచి, చెడ్డలు విద్యార్థులపైన ఆధారపడి ఉంటున్నాయి. విద్యార్థులు సత్ప్రవర్తనతో, సదాచారముతో తమ నడతను మార్చుకున్నప్పుడే దేశము బాగు పడుతుంది. సాధనలు చేసి యేమీ ప్రయోజనము లేదు. ఈ సాధనలవల్ల లభించే ఫలితము ఏమిటి? తాత్కాలికమైన తృప్తినందించవచ్చును. ధ్యానము ధ్యానమని కూర్చుంటారు. ఏది ధ్యానము? జీవితములో సర్వము ధ్యానమే! ధ్యానములేక ఆఫీసు పని ఏ రీతిగా చేయగలవు? ఈ ఆఫీసుకు పోయే సమయములో రోడ్డుపై కారు డ్రైవ్ చేసుకొనిపోతున్నావు. ఈ డ్రైవింగ్ చేసే సమయములో నీకు రోడ్డుపైన ధ్యానము లేకపోతే ఏ రీతిగా డ్రైవ్ చేయగలవు? ధ్యానమంటే ఏమిటి? Walking, reading, talking, eating, writing practice ఇలా ప్రతి ఒక్కటి ధ్యానమే! అనగా ఏదైనా ఒక విషయముపైన మనస్సును లగ్నము చేయటమే ధ్యానము. విద్యార్థుల ధ్యానమంతా చదువుపైన, తల్లి ధ్యానమంతా బిడ్డలపైన, గృహస్థుల ధ్యానమంతా కుటుంబముపైన, కార్మికుల ధ్యానమంతా మిషన్లపైన, కర్షకుని ధ్యానమంతా భూమిపైన. ఇలా ఒక్కొక్కరికి ఒక్కొక్క విషయముపైన ధ్యానము ఉంటున్నది. అదే విధముగ నీ మనస్సును దైవముపైన లగ్నము చేయి! అంతేగానీ నిరంతరము యేదో చేస్తున్నామనుకొని నీవు భగవంతుని పని చేయటం లేదని అనుకోకూడదు. 'ఏ పని చేసినా యిది భగవంతుని పనే!' అని భావించు. ఈ విధంగా సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థమని భావించు. నీవు భూమిని దున్నుతున్నావు. 'నా హృదయ భూమిని నేను సాగుచేస్తున్నాను' అనుకో! దాంట్లో విత్తనములు చల్లుతున్నావు. 'నా హృదయభూమిలోపల మంచి విత్తనములు జల్లుకుంటున్నాను. సద్గుణములనే విత్తనములు చల్లుకుంటున్నాన'నుకో! నీరు కడుతున్నావు. 'ప్రేమ జలమును దీనికి కడుతున్నాను' అనుకో! ఈ విధంగా ఆధ్యాత్మికమార్గములో ప్రవేశించాలనుకుంటే జపమాల మాత్రమే పట్టుకోనక్కరలేదు. వంటరిగా కూర్చోనక్కరలేదు. అరణ్యమునకు పోనక్కరలేదు. తాను చేస్తున్న పనియందే దివ్యత్వాన్ని సందర్శించవచ్చు. ఈనాడు మానవత్వములో మొట్టమొదట గుర్తించవలసినది, మనం ఐక్యతను కోల్పోతున్నాము. ఐక్యతను పెంచుకోవాలి! అందరు ఒక్కటిగా మనము భావించుకోవాలి! శారీరకంగా మీమధ్య భేదములుండవచ్చును. మానసికంగా అభిప్రాయభేదములుండవచ్చు. కానీ ఆత్మతత్త్వము ఒక్కటే! అదే 'ఏకోహం బహుస్యాం'.

యిలాంటి అనేకత్వములో ఉండిన ఏకత్వాన్ని గుర్తింపచేసే సాధనలో మనము ప్రవేశించాలి.

**ప్రపంచములో ఎక్కడ చూచినప్పటికిని అంగ, అంగీభావసంబంధమే సాక్షాత్కరిస్తున్నది**

ప్రేమస్వరూపులారా! మన సంబంధము శాశ్వతమైనది. నిన్న చెప్పినట్లుగా అంగములు శరీరమునకు ఎంత ప్రధానమో, యింద్రియములు శరీరమునకు ఎంత ప్రధానమో, శరీరములు సమాజమునకు అంత ఆధారము. సమాజములో ఉన్న అంగములే యీ శరీరములు. ఈ సమాజము మానవత్వపు అంగము. మానవత్వము ప్రకృతికి అంగము. ఈ ప్రకృతి, పరమాత్మకు అంగము. కనుక ప్రపంచములో ఎక్కడ చూచినప్పటికిని అంగ, అంగీభావసంబంధమనేది సాక్షాత్కారిస్తున్నది. యింక ద్వేషానికి ఎక్కడ అవకాశము ఉంటున్నది? యిదంతా బ్రహ్మాండము. ఈ బ్రహ్మాండమే విశ్వవిరాట్‌స్వరూపము. ఈ విరాట్‌స్వరూపములో అందరూ భాగములే! 'నేను యేమీ తెలియని మూర్ఖుడను, నేను విద్యావిహీనుడను, నేను అల్పుడను' అని అనేకమంది భావిస్తూ ఉంటారు. ఆ విధంగా భావించకూడదు. ఉదాహరణకు రాకెట్టులోపల అనేక పిన్నులు, బోల్టులు, నట్లు, స్క్రూలు, యివన్నీ ఉంటుంటాయి. ఈ రాకెట్టులో ఏ భాగము ప్రధానమైనది? దీనిని ఎవరూ నిర్ణయించటానికి వీలు కాదు. ప్రతి స్క్రూ ముఖ్యమే, ప్రతి బోల్టు ప్రధానమైనదే! నట్టుకూడా ప్రధానమైనదే! యింత పెద్ద రాకెట్‌లోపల యింత చిన్న పిన్ పోతే యేమి నష్టమంటే, అంతా భస్మమైపోతుంది. కనుక, యీ విశ్వవిరాట్‌స్వరూపములో ఒక్కొక్క వ్యక్తి, ఒక్కొక్క పిన్, బోల్టు, నట్, స్క్రూలు. కనుక, ఎవరెవరి స్థానములలో ఎవరెవరు యే విధముగా ఉండాలో ఆవిధంగా వారు వారి కర్తవ్యమును చక్కగా నిర్వర్తించాలి. అప్పుడే యీ విశ్వమనే మిషన్ చక్కగా నడుస్తుంది, ప్రశాంతిని చేకూరుస్తుంది. విశ్వశాంతిని కోరి మనము యీ పనిని ప్రారంభించాలి. విశ్వశాంతి అనగా తమకు సంబంధించినది కాదని భావించరాదు. విశ్వశాంతియే వ్యక్తి శాంతి! ఎందుకనగా విశ్వములో నీవు ఒకడు. ఆ విధమైన సమత్వమును మనము విశ్వసించాలి.

**భావశుద్ధి లేకపోతే జ్ఞానశుద్ధి మనకు లభ్యము కాదు**

దివ్యాత్మస్వరూపులారా! ఏదో గొప్పగా మనము పుట్టిన దినములని, పర్వదినములని అనేక



sri sathyasai vahini amrutam

విధములైన వేడుకలు చేసుకొంటున్నాము. ఈ వేడుకలు కాదు, మనకు ప్రధానము. మనకు వేషములు కాదు, ప్రధానము. భాషలు కాదు, ప్రధానము. భావము ప్రధానము. ఈ భావశుద్ధి లేకపోతే జ్ఞానశుద్ధి మనకు లభ్యము కాదు. చిత్తశుద్ధి నిమిత్తమై తగిన చర్యలు చేపట్టండి. అందరిని ప్రేమించండి. ఐతే, యీ ప్రేమను స్వార్థమైనదిగా రూపొందింపచేయకూడదు. అందరియందు ఉన్న దైవత్వము ఒక్కటిగా విశ్వసించండి. నిరంతరము సమాజసేవలో పాల్గొనాలి. 'గ్రామసేవయే రామసేవ' అని చెప్పాను. ఈ గ్రామసేవ చేసినప్పుడు అదే రామసేవగా మారుతుంది. కేవలం ఒక రామమందిరం నిర్మించాలనుకోటం చాలా పొరపాటు! యింత గొప్ప విశాలమైన భారతదేశములో ఏదో ఒక చోట ఒక రామమందిరం నిర్మించుకుంటే మనకు వచ్చిన ఫలితమేమిటి? ప్రతి ఒక్కరి హృదయముకూడను రామమందిరముగా మార్చుకోవాలి. మన భారతదేశమే రామరాజ్యముగా విశ్వసించాలి. రామరాజ్యమనగా ఏమిటి? రామరాజ్యమనగా ప్రత్యేకించి ఒక ధర్మము కాదు. ఆలోచన, నడత, గుణము యీ మూడింటియొక్క సమ్మిళితమే రామరాజ్యము! అదే 'మనస్యేకమ్, వచస్యేకమ్, కర్మణ్యేకమ్ మహాత్మనమ్'. ఈనాడు యూనిటీ లేదు, ప్యూరిటీ లేదు, డివినిటీ అంతకంటే లేదు. కేవలము కమ్యూనిటీని పట్టుకొని వేళ్ళాడుతున్నారు. యిది కాదు, మానవుని ప్రధాన కర్తవ్యము. ఈ విధముగా సమాజమును మనము విభాగము చేసినప్పుడు మానవత్వానికే అపకారము చేసినవారమవుతాము. మానవత్వము పెంచుకోవాలంటే ఐక్యతను పెంపొందించుకోవాలి.

**దైవమును నమ్మనివాడు తనను తాను నమ్మనివాడే!**

భారతీయ సంస్కృతి అంటే ఏమిటి? ఇది ప్రత్యేకించి ఒక దేశమునకు సంబంధించినది కాదు. అన్ని దేశములకు సంబంధించినటువంటిదే! దేశములు వేరు కావచ్చు, కాలము వేరు కావచ్చు, కర్తవ్యములు వేరు కావచ్చు. కానీ మానవుని నడత ఒక్కటే కావాలి. మనము ఉండిన స్థానమునుండి ఉన్నతస్థాయికి పోవాలంటే మొట్టమొదట మన నడతను అభివృద్ధిగావించుకోవాలి. కాళ్ళక్రిందనున్న భూమే కదలిపోతూ ఉంటుంటే మనము ఉన్నతస్థాయికి యే రీతిగా చేరుకోగలము? పునాదిరాళ్ళే కదలుతుంటే నిశ్చలమైన భవనము యేరీతిగా నిర్మించగలము? మన నడతే మన పునాది, మన చర్యలే మనకు ఆధారములు.

srisathyasaivachanamrutam

దీనియందు మొట్టమొదట మనం నమ్మకము కుదుర్చుకోవాలి. ఆ నమ్మకమే లేకపోతే మనము జీవితమునే వ్యర్థము గావించుకుంటాం!

**నమ్మకమను రెండు నయనంబులే లేని**
**అంధులైరి మనుజులవనియందు**
**తాము చూడకున్న దైవంబు లేడొకొ!**
**తనకు లేడుగాని మనకు లేడ?**

అన్నింటిని నమ్ముతున్నాడు, యీనాటి మానవుడు. కానీ దైవాన్ని నమ్మటం లేదు. అదే వానియొక్క దురదృష్టము. దైవము సర్వులందు ఉంటున్నాడు. దైవమును నమ్మనివాడు తనను తాను నమ్మనటువంటివాడే! కనుక, self confidence అభివృద్ధిగావించుకోవాలి. అదే పునాది, మన భారతదేశమునకు. ఏ దేశమునకైన నమ్మకమే పునాది. దీనిపైన ఆనందమనే గోడలు మనము నిర్మించుకోవాలి. ఈ ఆనందమనే గోడలపైనే త్యాగమనే పైకప్పు వెయ్యాలి. ఆ త్యాగమనే పైకప్పు క్రిందనే నీవు జీవించాలి. కనుక

**Self confidence - foundation**
**Self satisfaction - wall**
**Self sacrifice - roof**
**Self realisation - life**

జీవితములో నమ్మకమును పోషించుకోవాలి. అనవసరమైన మాటలతో ఈనాడు మనం కాలమును వ్యర్థము చేస్తున్నాం. పరనిందలతో కాలమును అపవిత్రము గావిస్తున్నాము. దైవనామాన్ని ఎందుకు స్మరించకూడదు? అప్పుడే మానవత్వానికి తగిన ఆనందము చేకూరుతుంది. హృదయము పరిశుద్ధమవుతుంది. దివ్యమైన జీవితమును మనము అందుకోగలుగుతాము.

**(తేదీ 23-11-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam